క్లుప్తంగా

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వేంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

నేడు భూలోకమాంబ పండగ



సింహాచలం: 98వ వార్డు పరిధి అప్పన్న పాలెంలో కొలువైన భూలోకమాంబ అమ్మవారి పండగ మహోత్సవం ఆదివారం జరగనుంది. ఈ మేరకు ఆలయ కమిటీ ఘనంగా ఏర్పాట్లు చేసింది. ఆలయాన్ని పూలమాలలు, విద్యుద్దీప కాంతులతో అలంకరించారు. తెల్లవారు జాము నుంచి అమ్మవారికి మేలుకొలుపు సేవ, పసుపు నీళ్లతో ఉత్సవమూర్తికి అభిషేకం, షోడశోపచారపూజలు, అష్టోత్తర శతనామార్చన నిర్వహించి అమ్మవారి మూలవిరాట్ దర్శనాలను కల్పిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు పలు రకాల పిండి వంటలతో అమ్మవారికి సారె సమర్పణ, మహా భోగ నివేదన చేయనున్నారు. సాయంత్రం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్, జీఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీ నివాసితుల సహకారంతో బుర్రకథ ఉంటుందన్నారు. వీటితోపాటు వివిధ సాంస్కృతి కార్యక్రమాల్లో భాగంగా బిందెల డ్యాన్స్, నేల డ్యాన్సులు, డప్పులు, కాళీమాత నృత్య ప్రదర్శన ఉంటాయని పేర్కొన్నారు.

మహిళా పోలీసులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ విద్యాధరి, పాల్గొన్న ఎస్ఐ దివ్య

సబ్బవరం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో అంతర్జాతీయ మహిళా వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది కుటుంబాలకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ విద్యాధరి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందించారు. శిబిరంలో సుమారు 40 మంది వరకూ మహిళా పోలీసులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని, వైద్య సేవలు పొందారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మహిళా ఎస్ఐ టి.దివ్య మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రాధాన్యతను, వారోత్సవాల్లో భాగంగా చేపట్టే కార్యక్రమాలను వివరించారు.

సందడిగా గ్రాడ్యుయేషన్ డే



చిన్నారులతో పాఠశాల యాజమాన్యం

పరవాడ: మండలంలోనిపి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్లో కిండర్ గార్డెన్ చిన్నారుల పట్టా స్వీకరణోత్సవం(గ్రాడ్యుయేషన్ డే)ను శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. ప్రాథమిక విద్యకు అర్హత సాధించిన తరుణంలో జరిపే కార్యక్రమంలో భాగంగా ఆట పాటలతో సరదాగా గడిపారు. పాఠశాల డైరెక్టర్ పి.ఉదయ నాగశ్రీ పాల్గొని ప్రాథమిక విద్యలో అడుగు పెడుతున్న చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్, కోఆర్డినేటర్ రామలక్ష్మిలు చిన్నారులు బాగా చదివి, వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. రామాన్‌కౌర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీమారంగంలో ఉపాధిపై అవగాహన



మాట్లాడుతున్న వెంకటేష్

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు యూనివర్సల్ సోంపో జనరల్ ఇన్సూరెన్స్ ప్రొడక్ట్స్, ఇన్సూరెన్స్ రంగంలో ఉద్యోగ అవకాశాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏరియా మేనేజర్ బి.వెంకటేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ ప్రొడక్ట్స్ గురించి ఎస్ఎస్ఈ ట్రైనర్ ఎం.శ్రీను విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, అధ్యాపకులు డాక్టర్ ఎస్.సత్యనారాయణ, బి.లక్ష్మి పాల్గొన్నారు.

గ్రావెల్ దందా.. ఆపే దమ్ముందా?

కూటమి పాలనలో గ్రావెల్ కొండలు, గుట్టలు కరిగిపోతున్నాయి. అధికారం మాదైనపుడు.. మమ్మల్ని ఆపేదెవడ్రా అంటూ.. రెచ్చిపోతున్నారు. అధికారులు కూడా వీరికి వంత పాడుతున్నారన్న ఆరోపణలున్నాయి. గ్రావెల్ అక్రమ తవ్వకాల గురించి సమాచారం ఇచ్చిన వారి వివరాలను అక్రమార్కులకు అందిస్తున్నారు. దీంతో సమాచారం అందించిన వారిపై దాడులకూ వెనుకంజవేయట్లేదు. చివరికి వైఎస్సార్ అర్బన్ హౌసింగ్ లేఅవుట్లనూ వదలకుండా తవ్వేస్తుండంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పట్టపగలే ట్రాక్టర్ ద్వారా గ్రావెల్ తరలించుకుపోతున్న దృశ్యం



సంధ్యానగర్ కాలనీ సమీపంలోని లేఅవుట్‌లో నిల్వ చేసిన గ్రావెల్

- గంగవరం, వెదుళ్లనరవ ప్రాంతాల్లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు
- మమ్మల్ని ఆపేదెవడ్రా.. అంటున్న కూటమి నాయకులు
- రాత్రుళ్లు జేసీబీలు, డంపర్లతో గ్రావెల్‌ను మాయం చేస్తున్న వైనం
- నామమాత్రపు పెనాల్టీలతో సరిపెడుతున్న అధికారులు

సబ్బవరం: మండలంలోని జీవీఎంసీ పరిధి గంగవరం, అజనగిరి ప్రాంతాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. పైడివాడ, ఎల్లుప్పి, బోదువలస, ఎరుకునాయుడు పాలెం వంటి ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీస్ అధికారులు అడపాదడపా దాడులు నిర్వహిస్తున్నా ఫలితం కానరావట్లేదు. కూటమి నేతల ఒత్తిళ్లతో అక్రమ తవ్వకాలు చేస్తున్న వారిని చాలాసార్లు చూసీ చూడనట్లుగా వదిలేస్తున్నారు. మరీ తప్పని పరిస్థితిలో ఫైన్లతో సరిపెడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మమ్మల్ని ఆపేదెవడ్రా..

జీవీఎంసీ పరిధిలోని గంగవరం, వెదుళ్లనరవ ప్రాంతాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిపేవాళ్లు కొండవాలు ప్రాంతాలు, ప్రభుత్వ భూములు, లేఅవుట్లను కూడా విడిచిపెట్టడం లేదు. కూటమి ప్రభుత్వంలో మమ్మల్ని ఆపేదెవడ్రా అంటూ రెచ్చిపోతున్నారు. ఇక్కడ 19 మంది గ్రావెల్ వ్యాపారులు 12 జేసీబీలు, 25 వరకూ డంపర్లను వినియోగించి పెద్ద ఎత్తున గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. స్థానికంగా ఉండే గంగవరం, వెదుళ్లనరవ, కొత్తూరు, దువ్వాడ, సంధ్యానగర్ కాలనీ, అజనగిరి ప్రాంతాల్లోని ప్రైవేట్ లేఅవుట్లలో రాత్రి పూట గ్రావెల్‌ను తవ్వి, స్టాక్ చేసి పగటి పూట యథేచ్ఛగా విక్రయాలు చేపడుతున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు

రెవెన్యూ, పోలీస్, మైనింగ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈ గ్రావెల్ దందా వైపు కన్నెత్తి చూసే సాహసం చేయట్లేదు. అక్రమంగా గ్రావెల్ తరలించే మార్గంలో అడపాదడపా పట్టుబడిన వాహనాలను మొక్కుబడిగా సీజ్ చేసి, నామమాత్రపు పెనాల్టీలతో సరిపెడుతున్నారు. గ్రావెల్ తవ్వకాల మూలాలపై దృష్టిసారించట్లేదు. గంగవరంలోని వైఎస్సార్ అర్బన్ హౌసింగ్ లే అవుట్ రోడ్లు, బేస్‌మెంట్లను సైతం తవ్వి గ్రావెల్ తరలించుకుపోతున్నారు. విద్యుత్ టవర్‌లైన్‌నూ విడిచిపెట్టలేదు. దీంతో విద్యుత్ టవర్ లైన్ ప్రమాదంలో పడింది. గంటల వ్యవధిలోనే ఫిల్లింగ్ చేపడుతూ రోజు రూ.లక్షల్లో అక్రమార్జన చేస్తున్నారు. ఒక్కో డంపర్ రూ.7–8 వేల వరకూ విక్రయిస్తున్నట్లు సమాచారం.



గంగవరంలో యథేచ్ఛగా తవ్వేయడం వల్ల ప్రమాదకరంగా విద్యుత్ టవర్



గంగవరంలోని జగనన్న అర్బన్ హౌసింగ్ లే అవుట్‌లో గ్రావెల్ కోసం తవ్వేసిన అక్రమార్కులు

సమాచారం ఇచ్చిన వారిపై దాడులు

గ్రావెల్ తవ్వకాలు మండలంలో మరెక్కడా జరగక్కుండా కేవలం జీవీఎంసీ పరిధిలోనే జరగడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ముందు జనసేన పార్టీలో చేరిన కొంత మంది అధికారం అండతో చెలరేగిపోతున్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలపై సమాచారం అందించే స్థానికులపైనే దాడులకు దిగుతున్నారు. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ విభాగాల్లో కొందరు వ్యక్తులు తమకు సమాచారం ఇచ్చిన వారి వివరాలను అక్రమార్కులకు చేరవేస్తున్నారన్న అనుమానాలున్నాయి. గ్రావెల్ తవ్వకాల సమయంలో అధికారులకు పట్టుబడకుండా ఇన్‌ఫార్మర్లను కూడా ఏర్పాటు చేసుకున్నట్లు తెలిసింది. గ్రావెల్ దందాలో ఉన్నవారు సిండికేట్‌గా ఏర్పడి వ్యాపారాన్ని యథేచ్ఛగా సాగిస్తున్నారు.

క్రిమినల్ చర్యలు తప్పవు



గంగవరం, వెదుళ్లనరవ, అజనగిరి ప్రాంతాల్లో గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్న విషయం మా దృష్టికీ వచ్చింది. రాత్రి పూట ఎక్కువగా గ్రావెల్ తరలిస్తున్నట్లు గుర్తించడంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం. వీఆర్వోలను అప్రమత్తం చేసి గ్రావెల్ తవ్వకాలను నియంత్రిస్తాం. మైనింగ్, పోలీస్ అధికారులతో కలిసి దాడులు నిర్వహిస్తాం. గ్రావెల్ తరలించే వారిపై కేసులు నమోదు చేసి క్రిమినల్ చర్యలు తీసుకుంటాం.

– బి.చిన్నికృష్ణ, తహసీల్దార్, సబ్బవరం

ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు ప్రారంభం



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

పరవాడ: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యాయి. విద్యార్థులను సిబ్బంది తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. ఇక్కడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు రాయడానికి పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల, హైస్కూల్ ప్లస్, తానాం రెసిడెన్షియల్, కేజీబీవీ, పాటిపల్లి మోడల్ పాఠశాలల నుంచి 491 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా శనివారం పరీక్షకు 484 మంది హాజరయ్యారు. ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణాధికారి జె.లక్ష్మికుమారి చెప్పారు. పరీక్ష కేంద్రం వద్ద పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు పర్యవేక్షణలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సబ్బవరం: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఇంటర్ ఫస్టియర్ తొలి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సబ్బవరం జూనియర్ కళాశాలలో నిర్వహించిన పరీక్షలకు 306 మంది విద్యార్థులకు 298 మంది హాజరవగా 8 మంది గైర్హాజరైనట్లు సూరింటెండెంట్ పి.సుభాషిణి తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలో 289 మంది విద్యార్థులకు 282 మంది హాజరవగా 7గురు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎన్.రామకృష్ణ వెల్లడించారు.



సబ్బవరంలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



అప్పన్నకు సహస్రనామార్చన నిర్వహిస్తున్న అర్చకుడు



జీలకర్రబెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వామికి సహస్రనామార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై వేంజేపచేశారు. 1001 నామాలతో స్వామికి అర్చన చేశారు. భక్తులకు తులసి ప్రసాదాన్ని అందించారు.

- స్వామికి నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచి, ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి గరుడసేవ శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేష హారతి అందజేశారు.

మహిళా పోలీసులకు ఉచిత వైద్య సేవలు



డీసీపీ(క్రైమ్) లతా మాధురికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

విశాఖ సిటీ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో డీసీపీ (క్రైమ్) లతామాధురి ఆధ్వర్యంలో శనివారం పోలీస్ కల్యాణ మండపంలో అపోలో ఆస్పత్రి వైద్య బృందంతో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 220 మంది మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది పరీక్షలు చేసుకున్నారు. వీరికి వైద్య పరీక్షలు చేయడమే కాకుండా అవసరమైన వారికి మందులు అందజేశారు.

పిల్లల్ని తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు కీలకం



డీఎస్పీ విష్ణుస్వరూప్‌ను సన్మానిస్తున్న కరస్పాండెంట్ రంగారావు

పరవాడ: పిల్లల విద్యా బుద్ధులపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ అన్నారు. గొర్లివానిపాలెంలోని శ్రీసాయి విద్యా నికేతన్ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ పిల్లలు, టీవీ, మొబైల్ ఫోన్ల పట్ల ఆకర్షితులు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందన్నారు. తల్లిదండ్రులకు తెలియకుండానే పలు సైబర్ నేరాల్లో భాగస్వాములు అవుతున్నారని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పిల్లలతో తల్లిదండ్రులు స్నేహంగా వ్యవహరిస్తూ, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. పిల్లల ఆసక్తి మేరకు వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో శ్రీసాయి విద్యా నికేతన్ కరస్పాండెంట్ రంగారావు, మాజీ ఎంపీ భీశెట్టి సత్యవతి, పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, మధుసూదన్, స్టీల్‌ప్లాంట్ అధికారి భాను, ఎంఈవో జి.సాయిశైలజ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ఏయూ నూతన వీసీ



ఆచార్య రాజశేఖర్‌కు అప్పన్న జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని శనివారం ఆంధ్రా యూనివర్సిటీ నూతన వీసీ ఆచార్య గంగవంశం పైడి రాజశేఖర్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, జ్ఞాపికను ఏఈవో ఆనంద్‌కుమార్ అందించారు. ఏయూ వీసీగా రావడం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి అనుగ్రహంగా భావిస్తానని, అందరి ఆశీస్సులతో ఏయూ అభివృద్ధికి కృషి చేస్తానని ఆచార్య రాజశేఖర్ తెలిపారు. కాగా.. వీసీగా బాధ్యతలు స్వీకరించి తొలిసారి సింహాచలం వచ్చిన ఆచార్య రాజశేఖర్‌కు అడవివరం గ్రామస్తులు, ఆయన స్నేహితులు, సన్నిహితులు ఘన స్వాగతం పలికారు. రాజశేఖర్ సొంత గ్రామం అడవివరం. అడవివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్, వై.డి.వి.ప్రసాద్, రాజనాల సత్తిబాబు, గ్రామస్తులు బున్నీ, ఎస్.అప్పారావు తదితరులు ఆచార్య రాజశేఖర్ వెంట ఉన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం



పవర్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న అండిబోయిన లక్ష్మి

పెదగంట్యాడ: క్రీడాకారుల్లో ఉత్సాహం నింపేందుకు క్రీడాపోటీలు దోహదం చేస్తాయని హైకోర్టు న్యాయవాది అండిబోయిన లక్ష్మి అన్నారు. ఏపీ స్టేట్ పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అండిబోయిన అప్పారావు, మరలా భాస్కరరావు ఆధ్వర్యంలో పెదగంట్యాడ సీడబ్ల్యూసీలో 4వ ఏపీ స్టేట్ డెడ్ లిఫ్ట్ చాంపియన్ షిప్–2025, సెవెన్త్ ఏపీ స్టేట్ బెంచ్ ఛాంపియన్‌షిప్–2025 పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. వివిధ జిల్లాల సుమారు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ 1,2,3 మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో రెండు రోజుల పాటు పోటీలు నిర్వహించనున్నామని వివరించారు. విజేతలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అనురాధ, పేర్ల సత్యారావు, రాంబాబు, రేష్మ, అప్పారావు, పుల్లయ్య, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

రెండు షాపులపై కేసు



స్వీట్‌షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

సీతమ్మధార : నగరంలోని సీతమ్మధార, ఎంఎం టీసీ కాలనీ, టీపీటీ కాలనీ, తదితర ప్రాంతాల్లోని స్వీట్ షాపులు, హోటళ్లు, కిరాణా దుకాణాల్లో జిల్లా కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ గోవిందు, తహసీల్దార్ ఎం.రమేష్ తనిఖీలు నిర్వహించారు. రెండు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ (సర్కిల్–2) ఎస్.గోవింద్, సహాయ కార్మిక అధికారి (సర్కిల్–10) పి.విజయకుమార్, సహాయ కార్మిక అధికారి (సర్కిల్–9) విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చైతన్యంతో మహిళా సాధికారిత



న్యాయవాదులను సత్కరిస్తున్న అధ్యాపకులు

అగనంపూడి: మహిళా జాగృతితోనే మహిళా సాధికారిత సాధ్యమని, విద్యార్థి దశలో మహిళలు సమాజంలో ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాదులు జి.మోహనరావు, ఎంఎస్‌పీ మాధురి అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, చైతన్యం, హక్కులపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. మహిళలపై నేటికీ అఘాయిత్యాలు, దాడులు జరగుతున్నాయంటే హక్కులు, చట్టాలపై అవగాహన లేకపోవడమే కారణమన్నారు. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తే మహిళలకు ఏ సందర్భంలోనూ అన్యాయం జరగదన్నారు. కార్యక్రమంలో కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్లేస్‌మెంట్ అండ్ ట్రెనింగ్ డీన్ బొడే ప్రసాద్, కోఆర్డినేటర్లు మణి, లేఖశ్రీ పాల్గొన్నారు.

సిరులతల్లికి తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో ఉభయదాతలు పాల్గొన్నారు.

ఫ్రీ లెఫ్ట్ ... బీకేర్ ఫుల్

- నూతుల్లాంటి గోతులు
- ఫీట్లు చేస్తున్న ద్విచక్ర వాహనచోదకులు



లంకెలపాలెం జాతీయ రహదారి ఫ్రీ లెఫ్ట్ మార్గంలో నూతుల్లాంటి గోతులు



ఫ్రీ లెఫ్ట్ డివైడర్ వద్ద కోరుకుపోయిన రహదారి

అగనంపూడి: జాతీయ రహదారి లంకెలపాలెం కూడలి వద్ద రాంకీ ఫార్మాసిటీకి వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఫ్రీ లెఫ్ట్ వద్ద నూతుల్లాంటి గోతులు వాహనచోదకులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. జాతీయ రహదారి అనకాపల్లి వైపు వెళ్లే కూడలిలో భారీ వాహనాలు బారులు తీరుతుండడంతో ఫార్మాసిటీ వైపు మళ్లేందుకు వీలుగా కూడలి వద్ద ఎడమ వైపు రోడ్డును వేరు చేశారు. ఈ మార్గంలో ఫార్మా కంపెనీలకు చెందిన వందలాది బస్సులు, వాహనాలతోపాటు హిందూజా పవర్ ప్లాంట్‌కు చెందిన బొగ్గు లారీలు, ఎన్టీపీసీ ఫ్లయాష్ లారీలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఫ్రీ లెఫ్ట్ ఉన్న 20 మీటర్ల నిడివిలో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. మలుపు వద్ద రోడ్డు పూర్తిగా కోరుకుపోయింది. దీంతో కొద్దిపాటి దూరం ద్విచక్ర వాహనచోదకుడు ప్రయాణం చేయాలన్నా అవస్థలకు గురవుతుండడంతో పాటు గోతుల్లో వాహనం పడితే ఫీట్లు చేయాల్సి వస్తోంది. చాలాసార్లు వాహనాలు పల్టీ కొడుతున్నాయి. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు స్పందించి గోతులు పూడ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అప్పుడే.. భగ భగ

- మార్చి ఆరంభంలోనే మొదలైన వేడి



ఎండ కారణంగా నిర్మానుష్యంగా ఉన్న పెదగంట్యాడ ప్రధాన రహదారి

పెదగంట్యాడ: వేసవి కాలం ఆరంభంలోనే ఎండల తీవ్రత పెరిగింది..రోజురోజుకూ భానుడు భగభగమంటున్నాడు. ఫిబ్రవరి రెండో వారం నుంచే ఎండలు ముదరడం ప్రారంభించాయి. ఇక ముందు ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని జనం ఆందోళన చెందుతున్నారు. సాధరణంగా శివ రాత్రి తర్వాత కొద్దికొద్దిగా ఎండలు ముదురుతాయి. కానీ ఈ ఏడాది శివరాత్రికి నెల ముందు నుంచే ఎండలు తీవ్రరూపం దాల్చాయి. దీంతో వేసవి జాగ్రత్తలపై ప్రజలు అప్రమత్తం కావాలి.

35 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత

మండలంలో పగటి ఉష్ణోగ్రత 35 డిగ్రీలు దాటింది. దీంతో రాత్రి పూట చలి తీవ్రత తగ్గి ఉక్కపోత ప్రారంభమైంది. మండలంలో ఎండల తీవ్రత పెరగడంతో ఫ్యాన్లతోపాటు ఇక ఏసీలు, కూలర్లు గిర్రున తిరుగుతున్నాయి. గతేడాది ఈ సమయానికి ఇంత ఎండ లేదని నిపుణులు చెప్తున్నారు. ఈ ఏడాది మార్చి నెల చివరి నాటికి 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

విద్యార్థులూ జర భద్రం

ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పరీక్షలు ఉదయమే ప్రారంభం అవుతాయి కనుక ఎండ తీవ్రత కొద్దిగా తక్కువ ఉన్నా పరీక్ష ముగిసే సమయానికి మాత్రం ఎండలు పెరిగే అవకాశం ఉంటుంది.. విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకుని ఎండల తీవ్రత నుంచి తప్పించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు



బయటకు వెళ్లేటప్పుడు తప్పకుండా గొడుగు లేదా టోపీ వాడాలి. తెలుపురంగు, పలుచటి దుస్తులు ధరించాలి. సాధారణంగా వదులు(లూజ్)గా ఉండే వస్త్రాలనే వాడాలి.ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో బయట తిరగకుండా ఉండటమే ఆరోగ్యానికి మంచిది. ఎక్కువగా నీరు తాగడం, నీటిశాతం ఎక్కువగా ఉండే పండ్లను తీసుకోవడం దారా డీ హైడ్రేషన్‌కు గురవకుండా ఉండవచ్చు.

– డాక్టర్ మానస, వైద్యాధికారి ,యూపీహెచ్‌సీ సిద్ధేశ్వరం.